ప్రభాతవార్త
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గురువారం 16 జూలై 2026

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మదనపల్లె, జులై 15 ప్రభాతవార్త : మదనపల్లెలో 18న శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేపట్టే పర్యటనను విజయవంతం చేద్దామంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో మదనపల్లె నియోజకవర్గానికి చెందిన టిడిపి మండలాధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మాజీ ఎంపిపిలు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె జిల్లా కేంద్రంగా అయిన తరువాత తొలిసారిగా మదనపల్లెకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి పర్యటనకు ఘనంగా స్వాగతం పలికి సభను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యమంత్రి చీకలుబైలు వద్ద ఉన్న కదిరమ్మ చెరువును పరిశీస్తారని అటునుంచి బెంగుళూరు రోడ్డులోని బిస్కెట్ ఫ్యాక్టరీ ముందున్న మైదానంలో సభ నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు సిఎం సభకు తరలి రావాలని కోరారు. పార్టీ శ్రేణులంతా ఐక్యతతో కదలి రావాలన్నారు. రెండేళ్ళలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. సిఎం సభ విజయవంతం మిగతా 2పేజీలో

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత: ఎమ్మెల్యే కిషోర్



ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు జూలై 15 ప్రభాతవార్త: నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ సమస్యలు లేకుండా చూడడమే తన ప్రధాన లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కలికిరి నగిరిపల్లిలోని తన కార్యాలయానికి వచ్చిన ప్రతి ఫిర్యాదుదారుని కలిసి, సమస్యలను అడిగి తెలుసుకుని అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడమే తన ధ్యేయమని, పీలేరు అభివృద్ధికి అన్ని విధాల కట్టుబడి ఉన్నానని ఆయన పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ప్రతి సమస్యపై సాను కూలంగా స్పందించి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మంచి పాలన అందించడమే తన బాధ్యతని, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగనివ్వనని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## దాల్మియా సిమెంట్ 2వ ప్లాంట్‌కు

# శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్

- ప్రపంచంలోనే అత్యంత పర్యావరణహిత సిమెంట్ తయారు చేయనున్న దాల్మియా .
- కడపలో కొత్త తయారీ యూనిట్, 80శాతంకు పైగా పునరుత్పాదక విద్యుత్ వినియోగం,
- నీటి పూర్తి పునర్వినియోగం, 1,000 మందికి ఉపాధి;
- జగన్ రెడ్డి పార్టీ... హిట్ అండ్ రన్ పార్టీ .. రాయలసీమ అభివృద్ధికి క్యాన్సర్ గడ్డ జగన్..
- మంత్రి నారా లోకేష్






జమ్మలమడుగు, జూలై 15, ప్రభాతవార్త : దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థల్లో ఒకటైన దాల్మియా భారత్ లిమిటెడ్ (డీబీఎల్) ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో తన రెండో తయారీ యూనిట్‌కు బుధవారం శంకుస్థాపన చేసింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్!! కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్ !! సీఈఓ శ్రీ పునీత్ దాల్మియా, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. రూ.3,100 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న ఈ అత్యాధునిక సమగ్ర తయారీ కేంద్రం ప్రపంచంలోనే అత్యంత పర్యావరణహిత (గ్రీనెస్ట్) సిమెంట్‌లలో ఒకదాన్ని ఉత్పత్తి చేసేలా రూపుదిద్దుకోనుంది. ఈ విస్తరణ ప్రణాళికను సంస్థ 2025లో ప్రకటించిన పెట్టుబడి కార్యక్రమంలో భాగంగా చేపడుతోంది. 20.27.28 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో (క్యూ3ఎఫ్ వై28) ఉత్పత్తి ప్రారంభం కానున్న ఈ యూనిట్, దక్షిణ భారతదేశంలో దాల్మియా భారత్‌కు అతిపెద్ద సమగ్ర తయారీ కేంద్రంగా అవతరించనుంది. ఇందులో సంవత్సరానికి 6.1 మిలియన్ టన్నుల క్లింకర్ ఉత్పత్తి సామర్థం, 9.6 మిలియన్ టన్నుల సిమెంట్ తయారీ సామర్థం ఉంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు 1,000 మందికి అదనపు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ , సుస్థిర పారిశ్రామికీకరణ ద్వారా ప్రపంచ స్థాయి, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి దాల్మియా భారత్ బలమైన భాగస్వామిగా నిలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై సంస్థ మరోసారి విశ్వాసం ఉంచి భారీ పెట్టుబడి పెట్టడం సంతోషకరమని చెప్పారు. ఈ భాగస్వామ్యంతో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక సమాజాలు బలోపేతం కావడం, రాష్ట్ర పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి చెందడం, పర్యావరణహిత సాంకేతికత ఆధారిత వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్ !! సీఈఓ పునీత్ దాల్మియా మాట్లాడుతూ, గత పదేళ్లకు పైగా ఆంధ్రప్రదేశ్ తమ సంస్థ అభివృద్ధి ప్రయాణంలో కీలక భాగస్వామిగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో రాష్ట్రం దేశంలోనే అత్యంత పెట్టుబడులకు అనుకూలమైన, ప్రగతిశీల రాష్ట్రంగా ఎదిగిందని చెప్పారు. పారదర్శక పాలన, స్థిరమైన విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపార నిర్వహణకు అనుకూల వాతావరణం రాష్ట్రంలో మరో భారీ పెట్టుబడికి తమను ప్రోత్సహించాయని తెలిపారు. ఈ కొత్త తయారీ కేంద్రం తక్కువ కార్బన్ ఉద్గారాలతో కూడిన భవిష్యత్ సిమెంట్ తయారీపై తమ దీర్ఘకాలిక దృష్టికి ప్రతీకగా నిలుస్తుందని పునీత్ దాల్మియా పేర్కొన్నారు.

**దాల్మియా సిమెంట్స్‌ను బెదిరించి ఇబ్బందులు పెట్టిన పార్టీ వైసీపీ**

రాయలసీమ అభివృద్ధిని జగన్మోహన్ రెడ్డి ఏనాడూ పట్టించుకోలేదు. దానికి అద్భుతమైన ఉదాహరణ బ్రాహ్మణి స్టీల్. ప్రత్యక్ష్యంగా 10 వేల ఉద్యోగాలు, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు కానీ ఒక్క ఉద్యోగం రాలేదు. మైనింగ్ లైసెన్స్ తీసుకుని సుమారుగా 320 ఎకరాల్లో రెడ్ గోల్డ్ ..మిగతా 2పేజీలో

## కరమలవారిపల్లిలో

# మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్

### ప్రజలను కలిసి వివిధ సమస్యలపై వినతులు స్వీకరణ





జమ్మలమడుగు, జూలై 15,ప్రభాతవార్త : మైలవరం మండలం కరమలవారిపల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ 91వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించిన మంత్రి లోకేష్ వారి నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఏపీ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖకు కేటాయించిన పోస్టులలో ఖాళీగా ఉన్న 520 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఏఈ పోస్టులను మండల ఇన్‌ఛార్జిలతో భర్తీ చేయాలని హౌసింగ్ ఏఈ, ఎంఐసీ ఎంప్లాయిస్ పెడరేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల పరిధిలోని అర్బన్ లోకల్ బాడీస్ నుంచి గత 3 సంవత్సరాల లైబ్రరీ సెస్ మొత్తాన్ని జమ చేయడం, ఆలస్యం అయిన సెస్‌పై సర్వీస్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని ఏపీ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం మంత్రి నారా లోకేష్‌ను కలిసి కోరారు. కడప పట్టణంలోని జవహర్ బాల భవన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి టైం స్కేల్ కల్పించాలని భాలభవన్ పర్యవేక్షకురాలు సునీత కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# కడపతో దాల్మియా భారత్ అనుబంధం మరింత బలపడుతోంది

### దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ పునీత్ యధు దాల్మియా



జమ్మలమడుగు, జులై 15, ప్రభాతవార్త: దాల్మియా భారత్ సంస్థకు ఏపీ కేవలం వ్యాపార రాష్ట్రం మాత్రమే కాదని, ఏళ్ల నాటి సంస్థ ప్రయాణంలో కీలక భాగస్వామి అని దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ యధు దాల్మియా అన్నారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనుల శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేగవంతమైన విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేష్ నాయకత్వం, పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. పరిశ్రమల శాఖామంత్రి భరత్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ బాధ్యులు భూపేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చురుకూరి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కడపలో సుమారు 3100 కోట్ల పెట్టుబడితో కొత్త ఉత్పత్తి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ విస్తరణ పూర్తయిన తరూత ఏపీలో సంస్థ దాదాపు కోటి టన్నుల వరకు సిమెంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు, స్థానిక ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి విశేష ఊతం లభిస్తుందని పునీత్ యధు దాల్మియా తెలిపారు.

## కలసికట్టుగా పార్టీ

# అభివృద్ధికి కృషి చేద్దాం

- ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్న మంత్రి నారా లోకేష్
- ప్రొద్దుటూరులో కార్యకర్తలు, నేతల ఆత్మీయ సమ్మేళనంలో హామీ
- సమావేశం వద్ద స్వల్ప ఉద్రిక్తత.. అనుచరులను అడ్డుకున్న పోలీసులు



ప్రొద్దుటూరు జూలై 15 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్తకు పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని కలిసికట్టుగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. బుధవారం ప్రొద్దుటూరు శివారులోని బొల్లవరం ప్రాంతంలో నిర్వహించిన కార్యకర్తలు, నేతల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా చౌడూరు గ్రామ సమీపంలో స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, జిల్లా టిడిపి అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, టిడిపి యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీవీ, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తదితరులు మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కార్యకర్తల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కష్టమే ప్రధాన కారణమని అన్నారు. కార్యకర్తల త్యాగాలు, సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు, మేలు జరుగుతుందని చెప్పారు. స్థానిక నాయకత్వం అందరినీ కలుపుకొని పోయి కార్యకర్తల సమస్యలు, అవసరాలు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**సమావేశం వద్ద స్వల్ప ఉద్రిక్తత**

సమావేశం వెలుపల స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి తన అనుచరులతో సమావేశానికి రాగా, పోలీసులు ప్రవీణ్ రెడ్డిని మాత్రమే లోనికి అనుమతించి, ఐడీ కార్డులు లేని అనుచరులను అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అలాగే ప్రధాన వేదికపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి మాత్రమే అవకాశం కల్పించగా, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డికి వేదికపై స్థానం లేకపోవడంతో వారు కార్యకర్తలతో కలిసి కిందనే కూర్చొన్నారు. దీనిపై ఆయా వర్గాల కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను మంత్రి లోకేష్ సత్కరించి, వారితో జ్ఞాపికలు అందజేసి ఫోటోలు దిగారు.

## పులివెందుల రజక కాలనీలో

# అర్ధరాత్రి ఘర్షణ

### ముగ్గురికి తీవ్ర గాయాలు
### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



పులివెందుల, జూలై 15 ప్రభాతవార్త : పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న రజక కాలనీలో మంగళవారం అర్ధరాత్రి కుటుంబాల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసి ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం, ఓబులేసు భార్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న వారి దూరపు బంధువులైన వెంకట రవి, మునికాంతమ్మ ఆమెను మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించి నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆగ్రహం చెందిన ఓబులేసు, రవి, మునికాంతమ్మలను చంపేస్తానంటూ పలుమార్లు బెదిరించినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ బెదిరింపులతో అప్రమత్తంగా ఉన్నప్పటికీ, మంగళవారం రాత్రి ఇంటి పైకప్పుపై నిద్రిస్తున్న సమయంలో ఓబులేసు దాడికి పాల్పడినట్లు బాధిత కుటుంబం తెలిపింది. ఈ ఘటనలో వెంకట రవి(45) మునికాంతమ్మ (35) తీవ్రంగా గాయపడగా, వారి కుమారుడికి చేతి, వీపు భాగాల్లో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే క్షతగాత్రులను పులివెందుల ..మిగతా 2పేజీలో

## ఏటీఎంలు మార్చి డబ్బు కాజేసే మాయగాడు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం, జులై 15, ప్రభాతవార్త: ప్రొద్దుటూరులోని ఏటీఎం కేంద్రాల వద్ద బాదితులకు డబ్బులు డ్రా చేయించే నెపంతో ఏటీఎం కార్డులు మార్చి డబ్బులు కాజేసే మాయగాడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన దండనగారి సిద్దేష్ అలియాస్ సిద్దు వృద్దులు, చదువు రాని వారిని లక్ష్యంగా చేసుకొని జిల్లాలోని ఏటీఎం కేంద్రాల వద్ద వారికి సహాయం చేసేలా ప్రవర్తించి వారి ఏటీఎం కార్డులు కాజేసి డబ్బులు మాయం చేసేవాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏఎస్పీ విభూ కృష్ణ ఆదేశాల మేరకు బుధవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



## రూ.25 లక్షల ఎర్రచందనం స్వాధీనం

# ఐదుగురు నిందితుల అరెస్ట్



పీలేరు జూలై 15 ప్రభాతవార్త: రెండు వాహనాలతోపాటు రూ.25 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ ఆర్ ఓ కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు పులిచెర్ల మంగళంపేట రోడ్డులో మంగళవారం రాత్రి అటవీ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు కార్లలో ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. రెండు వాహనాలతోపాటు 14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఆర్వో తెలిపారు. ఈ దాడిలో ఫారెస్ట్ అధికారులు ప్రకాష్ కుమార్, రెడ్డిప్రసాద్, ప్రతాప్. సబియాసుల్తానా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత భవిష్యత్తుకు వృత్తి నైపుణ్యాలే బలమైన పునాది

"ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం" సందర్భంగా డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పిలుపు



రాయచోటి టౌన్, జులై 15, ప్రభాతవార్త:

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను అలవర్చుకున్న యువత మాత్రమే ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సమర్ధవంతంగా వినియోగించుకోగలరని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు. ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవంను బుధవారం డైట్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ విద్యా బోధకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు నిత్యజీవితానికి ఉపయోగపడే కమ్యూనికేషన్, సమస్య పరిష్కార నైపుణ్యాలు, డిజిటల్ పరిజ్ఞానం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, వ్యవస్థాపక దృక్పథం వంటి జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు మార్ల ఓబుల్ రెడ్డి, డైట్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఒకేషనల్ కోఆర్డినేటర్లు షంషీర్ భాష, రామకృష్ణారెడ్డి, వృత్తి విద్యా బోధకులు ఎస్.కె. మహబూబ్ బాషా, పి. రామాంజనేయులు, ఉపాధ్యాయులు ఎం. రత్నాలు, పరశురాం, మల్లికార్జున, సదాశివుడు, 9 10 తరగతుల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారుల కమిటీకి 20లోగా దరఖాస్తు చేసుకోండి

జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టి పాటి అరుణ

లక్కిరెడ్డిపల్లి, జులై 15 ప్రభాతవార్త :

ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జాతీయ క్రీడా పరిపాలన చట్టం నిబంధనల ప్రకారం అనమ్మయ్య జిల్లా కబడ్డీ క్రీడాకారుల కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అసో సియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టి పాటి అరుణ బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో పాల్గొన్న వారు జాతీయ స్థాయి పతాక విజేతలు, దేశ లేదా రాష్ట్ర స్థా యి పోటీల్లో అనమ్మయ్య జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించిన ప్రతి భావంతులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ స్వయం ధ్రువీకరణ క్రీడా పత్రాలను ఈనెల 20వ తేదీలోపు పంపాల్సి ఉంటుందన్నారు. వై కాంత్ 365 అట్ ది డేట్ జీమెయిల్ డాట్ కాం ఈ మెయిల్ లేదా 9060234567 వాట్సాప్ నంబర్కు పంపవచ్చన్నారు. ఇతర వివరాలకు సంప్రదించాలన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మార్కెట్ యార్డ్ చైర్మన్ డా. ఎస్ఎండి షఫీ నాయక్



లక్కిరెడ్డిపల్లి, జులై 15, ప్రభాతవార్త :

లక్కిరెడ్డిపల్లి మండల కేంద్రం లోని రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు సబ్సిడీ వేరు శెనగ కాయల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ డా. ఎస్ఎండి షఫీ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, లక్షీ ్మ ప్రసాద్ రెడ్డి ల ప్రత్యేక చొరవతో మండలంలోని రైతులకు అవసరమైన అన్ని రకాల రాయితీలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, కూటమి ప్రభుత్వం ఎప్పటికీ రైతుల పక్షమేనని ఆయన పునరుద్ఘాటించారు. రైతులు ప్రభుత్వ పథ కాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో ఆశించిన ఫలితాలు సాధిం చాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకట్రామరాజు, స్థానిక నాయకులు, ఆర్ ఎస్ కె అధికారి రూపేష్, సాధుల్లా, బాబు స్టూడియో భాస్కర్, మల్లి, అహ్మద్ అలీ, పృధ్వీ రాజు, రైతులు పాల్గొన్నారు.

## ముద్రగడ మృతి పార్టీకి తీరనిలోటు

వైకాపా ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్



మదనపల్లె, జులై 15 ప్రభాతవార్త

మాజీ మంత్రి, కాపుల సంక్షేమం కోసం తుదివరకు పోరాడిన నేత ముద్రగడ పద్మనాభం మృతి వైకాపాకు తీరనిలోటుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముద్రగడ పద్మనాభంకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నిస్సార్‌అహ్మద్ మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం కాపు సంక్షేమానికి పాటుపడిన తొలితరం నాయకునిగా పేరుగాంచారన్నారు. కాపులను బిసిలో చేర్చాలంటూ ఏడు సార్లు ఆమరణనిరాహారదీక్ష చేపట్టారని గుర్తు చేశారు. కాపుల కోసం ఆయన చేసిన సేవ ఎంతో గొప్పదన్నారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, నాయకులు తట్టి శ్రీనివాసులురెడ్డి, ఆనందపార్థసారథి, మహేష్, నాగరాజరెడ్డి, ఇర్ఫాన్‌ఖాన్, శారదారెడ్డి, పవన్, ఎస్.రమేష్, రామక్రిష్ణ, మల్లికార్జునరెడ్డి, నూరుల్లా, గ్రానైట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ అధ్యాపకునికి ప్రపంచస్థాయి గుర్తింపు

ఆర్జీయూకేటి ఛాన్సలర్ అభినందనలు



వేంపల్లె:జులై 15, ప్రభాతవార్త,

ఆర్కేవ్యాలి ట్రిపుల్ లో ఐటి మెంటార్ గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుడు జ్ఞాన వెంకట్ కుమార్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు సాధించారు. జులై 68 తేదిల్లో కౌలాలంపూర్ లో 39వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇండస్ట్రియల్, ఇంజనీరింగ్ అండ్ అదర్ అప్లికేషన్ ఆఫ్ అప్లైడ్ ఇంటలిజెంట్ సిస్టమ్స్ లో పాల్గొన్నారు. తన పరిశోధనలను క్వైరిగైడెడ్ కాంటాక్స్, అవేర్ మల్టీ మోడల్ అటెన్షన్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ట్రాఫిక్ సర్వైవలెన్స్ విడియో క్యాప్చరింగ్ అనే అంశం ద్వారా కాన్ఫరెన్స్ లో ప్రజెంటేషన్ ఇచ్చారు. దీంతో ఆయన పరిశోధనలకు బెస్ట్ ప్రజెంటేషన్ అవార్డు లభించింది. ఆర్జీయూకేటి ఖ్యాతిని అంతర్జాతీయ వ్యాప్తి చేసిన అధ్యాపకుడు జ్ఞాన వెంకట్, స్టూడెంట్ కావ్య, వీరికి గైడ్ ఇచ్చిన ఆర్కేవ్యాలి ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి డా.రవికుమార్ లను ఆర్జీయూకేటి కులపతి ఆచార్య మధుమూర్తి, ఉప కులపతి ఆచార్య లక్షీ ్మ నారాయణ, రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్ర కుమార్, ఆర్కేవ్యాలి డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఆర్కేవ్యాలి డైరెక్టర్ ఆచార్య జీ.విజయ ప్రకాష్ మాట్లాడుతూ క్యాంపస్ లోని ఇతర అధ్యాపకులు అంతర్జాతీయ గుర్తింపు లభించే అంశాలపై పరిశోధనలు చేయాలని

# రాయలసీమ కోటాలో బలిజలకు ఎమ్మెల్సీ కేటాయించాలి

రాష్ట్ర కాపునాడు సంఘ ఉపాధ్యక్షుడు అంజన్ కుమార్



తంబళ్లపల్లె జులై 15 ప్రభాతవార్త ః

రాష్ట్రంలో ఖాళీ ఏర్పడిన రెండు ఎమ్మెల్సీ స్థానాలలో రాయలసీమ ప్రాంతానికి చెందిన బలిజ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని రాష్ట్ర కాపునాడు సంఘ ఉపాధ్యక్షుడు అంజన్ కుమార్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం తంబళ్లపల్లెలో జరిగిన బలిజల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 33!! పైగా బలిజ సామాజిక వర్గం బలంగా ఉండి అందుకు తగ్గట్టు రాజకీయంగా అవకాశాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలో పలు నియోజకవర్గాలలో ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడానికి కృషి చేశామని నేడు రాష్ట్రంలో ప్రభుత్వం రావడానికి దశా దిశా బలిజ సామాజిక వర్గానికి నిర్ణయించే స్థాయిలో ఉన్నట్లు చెప్పారు. అలాంటి బలిజలకు రాయలసీమ ప్రాంతానికి చెందిన బలిజ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ ఇవ్వాలని ఈ విషయమై రాయలసీమలోని బలిజ సామాజిక వర్గం ఒక్క తాటిపై నిలిచి డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాయలసీమ లో బలిజ సామాజిక వర్గం దశాబ్దాలుగా ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప వారికి తగిన న్యాయం జరగలేదని ఇప్పటికైనా కచ్చితంగా ఎమ్మెల్సీ ఇవ్వాలని సీఎం, డిప్యూటీ సీఎం, బిజెపి మాధవ్, నారా లోకేష్ లను కోరుతున్నట్లు చెప్పారు. తం బళ్లపల్లె నియోజకవర్గం లో బలిజ సామాజిక వర్గం ఐక్యతతో పాటు బలోపేతానికి ఈ నెల 26వ తేదీ బి కొత్తకోటలో జరిగే బలిజ ఆత్మీయ సమావేశానికి ప్రతి బలిజ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేకే కృష్ణమూర్తి, కాకర్ల కృష్ణమూర్తి, కుంచు మోహన్, కొటాల శివకుమార్, ధనుంజయ, జగదీష్, మోపూరి రెడ్డప్ప, కసెట్టి వెంకట రమణ, రామచంద్ర, మధుసూదన్, మల్లికార్జునలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దాం

మొదటి పేజీ తరువాయి

కావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకుఛైర్మెన్ నాదెళ్ళ విద్యాసాగర్, పట్టణ అధ్యక్షులు అరుణ్‌తేజ్, కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్‌కె.రామక్రిష్ణాచారి, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్, ఆర్‌జె.వెంకటేష్, నవీన్‌చౌదరి, పోతబోలు సుధాకర్, నీలకంఠ, మోడెం సిద్దప్ప, ఎస్ఎం.రఫి, బాలుస్వామి, కత్తి లక్ష్మన్న, గుర్రప్పనాయుడు, నందకుమార్, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలకు చెందిన మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

## గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే ప్రజలు పోలీసులకు తెలియజేయండి

ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



రాయచోటి జులై 15 ప్రభాతవార్త :

గంజాయి, మాదకద్రవ్యాల సమాచారం ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100/112 లేదా టోల్ ఫ్రీ 1972 కు కాల్ చేసి పోలీసులకు సహకరించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధ వారం రాయచోటిలో మీడియా సమావేశంలో తెలిపారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ రామాపురం పరిధిలో గంజాయి సరఫరా చేస్తున్న ప్రధాన నిందితులు బోడన్నా (వైజాగ్), ఖాదర్ బాషా (రాయచోటి), పరిమల ప్రకాష్ (బీహార్)లను గువ్వలచెరువు ఘాట్ వద్ద అరెస్ట్ చేసి 4 కిలోల గంజాయి, 1 బైకు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరు విశాఖలో గంజాయి కొని బెంగళూరులో ఖిపోర్టర్ యాప్‌ఖి ద్వారా అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఆయన వివరాలు వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన రాయచోటి డీఎస్పీ యం.ఆర్. కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లి సీఐ శ్రీ కృష్ణంరాజు నాయక్, రామాపురం ఎస్ఐ కె.బి. శివ కుమార్, సిబ్బందిని ఎస్పీ ధీరజ్ కునిబిల్లి ప్రత్యేకంగా అభినందించారు.

## వ్యవసాయ బోర్ల సర్వీస్ వైర్ల వివాదం

మదనపల్లెక్రైం, జులై 15 ప్రభాతవార్త.

మండల పరిధిలోని మాలేపాడు పంచాయతీ నల్లరాజుగారిపల్లె (ఆవులపల్లి)లో మంగళవారం వ్యవసాయ బోర్ల సర్వీస్ వైర్ల వివాదం తీవ్ర ఘర్షణకు దారితీసింది. ఈ దాడిలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు నల్లరాజుగారిపల్లెకు చెందిన పి.రమణప్ప, అదే ప్రాంతానికి చెందిన ఆర్.రమేష్‌లకు చెందిన వ్యవసాయ బోర్లకు ఒకే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుండి కనెక్షన్లు ఉన్నాయి. ఈ విషయమై ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగి పెద్దదైంది. తీవ్ర ఆగ్రహానికి లోనైన ఆర్.రమేష్, సురేష్, శ్రీనివాసులు కలిసి రమణప్ప కుటుంబంపై దాడికి దిగారు.

## జిల్లా అభివృద్ధికి రూ.1000కోట్లు కేటాయించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్



మదనపల్లె, జులై 15 ప్రభాతవార్త

జిల్లా అభివృద్ధికి రూ.1000కోట్లు నిధులు కేటాయించి, జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సిపిఐ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈనెల 18న మదనపల్లెకు రావడం జరుగుతోందని ఎన్నికల సందర్భంగా జిల్లాకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్‌ను యుద్ధప్రాతిపదికంగా పూర్తి చేయాలని, బిటి కళాశాలను యూనివర్శిటి చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. జిల్లా అభివృద్ధిలో వెనుకబడి ఉందని, కడప బెంగుళూరు రైల్వేలైన్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మదనపల్లెలో టమేటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సహాయ కార్యదర్శి క్రిష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీలు మాట్లాడుతూ పట్టణం జిల్లా అయిన తరువాత ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్లు వేయాలన్నారు. నీటిసమస్యను తక్షణం తీర్చాలన్నారు. తాగు, సాగునీరుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు మాదవ్, రెడ్డిశేఖర్, తిరుమల, విజయ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## పీలేరు పట్టణం ఆర్ఓబి పనులలో నిరక్ష్యం నిండు ప్రాణం బలి

ఆర్ఓబి పనులపై కాంట్రాక్టర్ నిరక్ష్యం కన్న బిడ్డను కోల్పోయిన కుటుంబం

ఇరుకు రోడ్లు కానరాని ట్రాఫిక్ నియమ నిబంధనలు

పీలేరు జులై 15 ప్రభాతవార్త:

పాత బస్టాండ్ నందు సదుం రోడ్డు మలుపు వద్ద మురుగు నీటి కాలువలు సైతం ఆక్రమించి రేకుల షెడ్డులు వేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. రోడ్డు మలుపుకు ఇరువైపులా అటు వ్యాపార సముదాయాలు ఇటు ఆటోలు ఉన్న స్థలాన్ని ఆక్రమించుకోవడం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం పీలేరు సదుం రోడ్డులో ఉదయం వేళ నిర్వహించు దినసరి కూరగాయల మార్కెట్ వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఉంది పాత బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించు దినసరి కూరగాయల మార్కెట్ వేరొక స్థలానికి మార్చాలి. పీలేరు ఆర్ఓబి పనులను చేపట్టిన కాంట్రాక్టర్ అటు ప్రభుత్వం ఇటు అధికార యంత్రాంగం నిరక్ష ్యం కారణంగా ఇంకా ఎన్ని ప్రాణా లు గాలిలో కలిసి పోవాలి ఆర్ఓబి పనులు ఇలాగే కొనసాగితే కాంట్రాక్టర్ ప్రజాగ్రహానికి గురికాక తప్పదు ఇకనైనా అటు శివీతీ కాంట్రాక్టర్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రజల ఆరోగ్యాన్ని ప్రాణాలను కాపాడే దిశగా చర్యలు చేపట్టాలి ప్రజల ప్రాణాల పట్ల నిరక్ష ్యం వద్దు ప్రజల ప్రాణాలు కాపాడండి అని మాలమహానాడు సభ్యులు కోరుకుంటున్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నేతలు

జిల్లా ఉపాధ్యక్షులుగా కొండపల్లి చిన్న సుబ్బారావు నియామకం!!



బద్వేల్ అర్బన్ జులై 15: ప్రభాతవార్త :

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ మరియు కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం బద్వేలు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్ ) అధ్యక్షులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ సి.వి. నాగేశ్వరరావు, ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు కె.వి. సుబ్బారావు, జిల్లా యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పైడిమర్రి సురేష్ బాబు, మరియు జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి ట్రెజరర్ దేవతి లలితలకు ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికింది. అమ్మవారి సన్నిధిలో వీరందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, సెక్రటరీ ఉరిమి శ్రీనివాసులు, ట్రెజరర్ భూపాలం నాగరాజారావు మరియు కమిటీ సభ్యులు జిల్లా నాయకులను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం, బద్వేలుకు చెందిన ప్రముఖ వైశ్య నాయకులు మరియు ఆలయ కమిటీ అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావును కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు ప్రకటించారు. ఈ సందర్భంగా చిన్న సుబ్బారావును శాలువాతో సత్కరించి, సంఘ బలోపేతానికి ఆయన మరింత కృషి చేయాలని కోరుతూ అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభలో ప్రతి ఒక్కరు సభ్యత్వం కలిగేలా అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు చూడాలని వారికి సూచించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు మాలేపాటి వెంకటేశ్వరరావు, దిండుకుర్తి సుబ్బరాయుడు, చిన్ని నరసింహులు, కొప్పరపు శ్రీనివాసులు, సగల రాధాకృష్ణమూర్తి, బెస్త వేముల సునీల్ కుమార్, కొండపల్లి సాయి, గుబ్బ వెంకటేశ్వర్లు మరియు పలువురు కమిటీ సభ్యులు, సంఘ నేతలు పాల్గొన్నారు.

# శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్

మొదటి పేజీ తరువాయి



అనే సంస్థ పేరుతో ఐరన్ ఓర్ ఇక్కడి నుంచి తీసుకెళ్లి విక్రయించారు. ఈ భూముల ద్వారా గాలి జనార్ధన్ రెడ్డికి, జగన్మోహన్ రెడ్డికి ఆదాయం వచ్చింది తప్ప కడప జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులకి ఒక్క ఉద్యోగం కూడా రాలేదు. కియాను తీసుకువచ్చిన ఘనత మాదిమేం తీసుకువచ్చిన కియా పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 30వేల మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రజాప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అది. 2019 నుంచి 2024 వరకు కియా యాజమాన్యాన్ని గొడ్డలి పార్టీ నాయకులు బెదిరించారు. దాల్మియా సిమెంట్‌కి ఏకంగా నోటీస్ పంపించి ఫ్యాక్టరీ మూసేయాలని చెప్పారు. డబ్బులు ఇస్తేనే ఫ్యాక్టరీ నడుస్తుంది, లేదంటే మూసేద్దామనే ధోరణిలో వైసీపీ వాళ్లు ప్రవర్తించారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో యువతకి ఒక్క ఉద్యోగం రాలేదు. జగన్ హయాంలో 250 మంది మత్స్యకారులు చనిపోతే ఒక్క రూపాయి ఇవ్వలేదు దేశంలోనే రికార్డు స్థాయిలో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొస్తున్నాం దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ జమ్మలమడుగు రాయలసీమ అభివృద్ధికి క్యాన్సర్ గడ్డ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అనివిద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి పార్టీకి హిట్ అండ్ రన్ పార్టీ అనే పేరు పెట్టొచ్చు. జగన్ రెడ్డి కాన్వాయ్ వాహనం ఢీకొనడంతో ఆ పార్టీ కార్యకర్త సింగయ్య చనిపోయారు. శవాన్ని రోడ్డుపై వదిలి వెళ్లారు. నిజాయితీగా ఉంటే కోర్టుకు వెళ్లి ఎందుకు స్టే తెచ్చుకున్నారు? జగన్ హయాంలో 250 మంది మత్స్యకారులు చనిపోతే ఒక్క రూపాయి ఇవ్వలేదుమత్స్యకారుల ఘటనపై ముందుగానే స్పందించాం. విశాఖ ఉక్కు పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పుడు మొదటగా స్పందించి చర్యలు తీసుకుంది మేమే. 12 గంటల్లోగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వచ్చారు. 24 గంటల్లోగా నేను వెళ్లాను. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారు కూడా వచ్చారు. మా బాధ్యతగా మత్స్యకారులకు రూ.10 లక్షలు చెక్ అందజేశాం. చనిపోయిన వాళ్లను తిరిగి తీసుకురాలేం. కనీసం ఆ కుటుంబానికి అండగా నిలబడడానికి డబ్బులు మేం అందజేశాం. జగన్ రెడ్డి పాలనలో ఐదేళ్లలో చనిపోయిన 250 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఒక్క రూపాయి కూడా అందజేయలేదు. ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు. మత్స్యకార సోదరులు వాస్తవాలను గమనించాలని మంత్రి పేర్కొన్నారు.

## విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు



లక్కిరెడ్డిపల్లి, జులై 15, ప్రభాతవార్త:

మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్‌లో బుధవారం జిల్లా విద్యాశాఖ వారి ఆదేశాల మేరకు విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోలర్ బ్లైండ్ ఇస్ జిల్లా మేనేజర్ డాక్టర్ రియాజ్ బేగ్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా దృష్టిలోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా అందజేస్తామని ఆయన తెలియజేశారు ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ఈ పరిచయం నిర్వహిస్తామని మొదటి రోజున 280 మంది విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో పీఎంఓ ఏ.రంజిత, హెల్త్ సూపర్వైజర్ మహమ్మద్ భాష, ప్రిన్సిపాల్ రమేష్ అధ్యాపకులు శివ శంకర్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారులు గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప



రామసముద్రం, జులై15, ప్రభాతవార్త:

రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె ఎం.గొల్లపల్లి గ్రామాలలో బుధవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప పర్యటించి, అధికారుల ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు బాణాసంచాల నడుమ పూలమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మండల అధికారులు, గ్రామస్తులు ఆయనకు శ్రీ వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేసి, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎం.గొల్లపల్లి గ్రామంలోని ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గిరిజనులు అన్ని రంగాలలో వారికి రావాల్సిన సంక్షేమ ఫలాలు అందుకొని అభివృద్ధి చెందాలని తెలిపారు. అధికారులు సకాలంలో వారి సమస్యల పట్ల స్పందించి వారికి అందుబాటులో ఉంటూ న్యాయం చేయాలని అన్నారు. లేనిచో వారిపై ఎస్టీ కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అలాగే సంబంధిత అధికారులు ప్రతి నెలకు ఒకసారి మండలంలోని గిరిజన గ్రామాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. పెద్ద సమస్యలు ఉన్నచో వాటిని మా కమిషన్ దృష్టికి తీసుకువచ్చిన యెడల రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తేజస్విని, తాహశీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీడీవో లతీఫ్ ఖాన్, ఆర్ఐ వసీం, ఎంఈఓ హేమలత, ఏపీ ఎం సాంబశివ, ఏవో జాఫర్, ఏపీవో మాధవి, ఎస్సై హృషికేశవరెడ్డి, ఏఈ మస్తాన్ వలి, హౌసింగ్ ఏఈ రాజరాజేశ్వరి, అయబ్ ఖాన్, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, శాంతకుమారి, జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, అమరప్ప, సింగంవారిపల్లి రామకృష్ణ, సంబంధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్‌లో అన్నదానం



మదనపల్లె, జులై 15 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో దివ్యాంగులకు, వృద్దులకు బుధవారం అన్నదానం నిర్వహించారు. ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు పుట్టినరోజు సందర్బంగా మదనపల్లె ఎన్ఎంయూ కడప జోనల్ అధ్యక్షులు వినోద్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం వెలుగు పాఠశాలలో దివ్యాంగులకు, వృద్దులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె ఆర్టీసి బస్టాండు ఆవరణంలో జిల్లా గౌరవ అధ్యక్షులు నాదేళ్ళ విద్యాసాగర్, రెండవ డిపో అధ్యక్షులు జోలిపాలెం దేవేంద్ర(చిన్ని)లతో కలసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్టీసి ఉద్యోగులకు, కార్మికులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఐదు డిపోల అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి ఘర్షణ

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడప ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. మరోవైపు, ఈ ఘర్షణలో ఓబులేసుకు కూడా తలకు గాయాలైనట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాల వాంగ్మూలాలను నమోదు చేసి, దాడికి గల కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం వారాంతపు అవగాహన కార్యక్రమం



బద్వేల్ అర్బన్ జులై 15: ప్రభాతవార్త :

ప్రపంచ జనాభా దినోత్సవం వారాంతపు అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారము బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్ర నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధి లోని సురేంద్ర నగర్ నందు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం వారంతపు జనాభా దినోత్సవం ర్యాలీ మరియు సమావేశము సెల్ఫీ గ్రూపు వారితో మరియు గర్భిణీ స్త్రీలు బాలింతలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జనాభా పెరగడము వల్ల వచ్చే పరిణామాల గురించి అవగాహన కల్పించడం, పిల్లల మధ్య ఎడమ పాడిద్దాం ఆరోగ్య వంతమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం", చెప్పడం జరిగినది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య మాట్లా డుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.జనార్దన్ రావు ఏఎన్‌యంలు, బి. సుధాధీరావతి ఆర్. లక్ష్మీదేవి జి.గురమ్మ అంగనవాడి టీచర్స్, ఆశలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు నివాళి అర్పించిన వైసీపీ నేతలు..

కడప కార్పొరేషన్ జులై 15 ప్రభాతవార్త:

కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మరణం తీరని లోటు అని వైసిపి నాయకులు అన్నారు. కడప వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సంతాప సభ నిర్వహించారు. ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్ర రెడ్డి, పాకా సురేష్ కుమార్, బండి నిత్యానంద రెడ్డి, ఎన్ఆర్ఐ ట్రస్ట్ చైర్మన్ తోట కృష్ణ, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివా ప్రసాద్, ఎస్సీ రాష్ట్ర నాయకులు పులి సునీల్ కుమార్, గుంటి నాగేంద్ర, సింధు, రెడ్డి ప్రసాద్, యానాదయ్యలు పాల్గొన్నారు.

# రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

**వేంపల్లె జూలై 15 ప్రభాతవార్త**

మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడ రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయం నుండి వచ్చిన ఆదేశాల మేరకు బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు నిర్మాణం, గ్రామీణా ప్రాంతాలకు వెళ్లే రహదారికి ఇరువైపుల ఉన్న కంప చెట్లు తొలగింపుపై టిడిపికి చెందిన క్లస్టర్ ఇన్ చార్జ్ లతో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రోడ్లు స్థితిగతులపై చర్చించడం జరిగిందని తెలిపారు. రోడ్ల పరిస్థితిని నివేదిక రూపంలో మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి వీధికి సిమెంట్ రోడ్లు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అలాగే రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లును కూడ తొలగించి ప్రజలకు అసౌకర్యం లేకుండా చేయడం జరుగుతుందని తెలిపారు. జిఎన్ఎస్ కాలువ నుండి ముచ్చు కొన చెరువుకు నీటిని విడుదల చేసి పాపాగ్ని నదిలోకి కృష్ణానీరు ప్రవహించేందుకు టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాపాగ్నినదిలోకి కృష్ణానీరు ప్రవహిస్తే వేంపల్లె మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రైతులకు చెందిన సాగునీటి బోర్లు లకు భూగర్భ జలాలు పెరగడం జరుగుతుందని వాటి ద్వారా రైతులకు ఇబ్బందులు తొలుగుతాయాని తెలిపారు. అలాగే త్రాగునీటి ఇబ్బందులు కూడ ఉండవని తెలిపారు. నందిపల్లెలో టిడిపి ఇన్ చార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే జలా హారతి కార్యక్రమాన్ని కూడ కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ ఛార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోగుల మల్లికార్జున, బిసి నాయకుడు డక్కా రమేష్, గురివి రెడ్డి, ఫయాజ్, జబిబుల్లా, గిరి, ఆంజి, షరీఫ్, కరీముల్లా, ఖాజాలతో పాటు టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉపాధి ద్వారా పండ్ల తోటల పెంపకం

**దువ్వూరు, జూలై 15, ప్రభాతవార్త:**

మండలంలోని రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 శాతం పండ్ల తోటలకు ప్రభుత్వం రాయతీ ఇస్తుందని రైతులు వినియోగించుకోవాలన్నారు. అలాగే వర్షాలు లేనందున ఉపాధి హామీ శ్రామికులకు పనులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించిందని ఇందులో భాగంగా 307 రూపాయల నుండి కూలి డబ్బులు 312కు పెంచారన్నారు. అర్హత గల రైతులు పండ్ల తోటల పెంపకాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



## దాల్మియా విస్తరణ జిల్లా అభివృద్ధికి ఓ కీలక ఘట్టం..!

**- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**

**జమ్మలమడుగు, జూలై 15, ప్రభాతవార్త:**

దాల్మియా భారత్ సిమెంట్ విస్తరణ ప్రాజెక్టు ప్రారంభం జిల్లాకు కీలక ఘట్టమని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అభివర్ణించారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనుల శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సిమెంటు పరిశ్రమ కాలుష్య ప్రభావం కలిగిన రంగమైనప్పటికీ ఆధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి విధానాలను అమలు చేస్తూ గ్రీన్ సిమెంట్ తయారీ దిశగా దాల్మియా యాజమాన్యం అడుగులు వేయడం అభినందనీయమన్నారు. దాల్మియా భారత్ సంస్థ తమ ఉత్పత్తి ఆదాయంపై మాత్రమే ఆలోచించకుండా సామాజిక బాధ్యతలో భాగంగా సుమారు రూ.42కోట్లతో ప్రాజెక్టు పరిసర గ్రామాల్లో విద్య, నైపుణ్య శిక్షణ, మహిళలసాధికారత, ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలను ఖర్చు చేస్తోందని తెలిపారు. ఒకప్పుడు వెనకబడిన ప్రాంతంగా భావించిన కడప జిల్లా నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. గతంలో సీఎం నారా చంద్రబాబునాయుడు ఇజ్రాయెల్‌లో అమలవుతున్న ఆధునిక వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసి వాటిని రాష్ట్రంలో ప్రవేశపెట్టడం వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. అరటి వంటి ఉద్యాన పంటల ఆధారంగా ఏర్పాటవుతున్న పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు స్థిరమైన ఉద్యోగాలను అందిస్తున్నాయని జిల్లా కలెక్టర్ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు.

## ముద్దనూరులో మళ్లీ దొంగల సంచారం..

**ముద్దనూరు: జూలై 15 ప్రభాతవార్త**

పట్టణంలోని కొత్తకొట్టాల వీధిలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో దొంగల సంచారం కలకలం రేపింది. కత్తులు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేసినట్లు నివాసితులు తెలిపారు.ఇటీవలి కాలంలో బైకులు, సైకిళ్లు, గొర్రెలు, పందులు తదితర వస్తువులు, పశువుల దొంగతనాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్రమత్తమైన వీధి ప్రజలు ఒక అనుమానితుడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.స్థానికుల కథనం ప్రకారం ఒక బొలెరో క్యాంపర్ మరియు ఇటియోస్ కారులో దాదాపు పందిమంది వచ్చారని,కొంత మంది ఎస్సీ కాలనీ వైపు వెళ్లారని స్థానికులు తెలిపారు. అదుపులోకి తీసుకున్న నిందితుల్ని పోలీసులు పారిపోయిన వ్యక్తుల గురించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.గతంలో కూడా పందులు, సైకిళ్లు, బైకుల దొంగతనాలకు పాల్పడిన కొందరు వ్యక్తులు బొలెరో క్యాంపర్ వాహనాల్లో వచ్చేవారు.వారిని అడ్డుకునే ప్రయత్నంలో రాళ్లు రువ్వి పోలీసులపైనా దాడికి పాల్పడిన ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి.కావున మండలంలోని ప్రజలు పోలీసులు దొంగతనాలను అరికట్టి,ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులను కఠినంగా శిక్షించాలని తెలిపారు.

## ప్రొద్దుటూరులో ప్రారంభమైన మెరుగైన రుమటాలజీ ఓపీ సేవలు

**ప్రొద్దుటూరు, జులై 15, ప్రభాతవార్త**

రాయలసీమ ప్రజలకు రుమటాలజీ వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్, కర్నూలు ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని శ్రీ సాయి దయాగ్నస్టిక్ సెంటర్లో రుమటాలజీ అవుట్‌రీచ్ కన్సల్టేషన్ సేవలను ప్రారంభించారు. ఈ సేవలు ప్రతి నెల మూడవ బుధవారం అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 2026 జులై 15 (బుధవారం) మొదటి రుమటాలజీ ఓపీ విజయవంతంగా నిర్వహించబడింది. రోగులు పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ ప్రాంతంలోనే నిపుణులైన రుమటాలజిస్ట్ సేవలు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా. సృజన ఎ., సీనియర్ కన్సల్టెంట్ రుమటాలజిస్ట్ మాట్లాడుతూ కీళ్ల నొప్పులు, ఉదయం లేవగానే కీళ్ల గట్టితనం, కీళ్ల వాపు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, లూపస్, వాస్కులైటిస్, యాంకిలోజింగ్ స్పాండిలైటిస్ వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. విశ్వ కుమార్ కె.ఎస్., సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ కూడా పాల్గొని రోగులతో మాట్లాడారు. దీర్ఘకాలిక నరాల మరియు వెన్నెముక సంబంధిత సమస్యలు, కీళ్ల వ్యాధులతో కలిసివచ్చే లక్షణాల విషయంలో సరైన నిర్ధారణ ఎంతో ముఖ్యమని, అవసరమైనప్పుడు బహుళ వైద్య విభాగాల సమన్వయంతో చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, కర్నూలు హెడ్ శ్రీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,"ప్రత్యేక వైద్య సేవలను నగ



రాలకే పరిమితం కాకుండా ప్రజలకు వారి ప్రాంతాల్లోనే అందించాలనే ఉద్దేశంతో ఈ రుమటాలజీ అవుట్‌రీచ్ క్లినిక్‌ను ప్రారంభించాము. ప్రొద్దుటూరు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఇప్పుడు నిపుణులైన రుమటాలజిస్ట్ సేవలను ప్రతి నెల మూడవ బుధవారం శ్రీ సాయి దయాగ్నస్టిక్ సెంటర్‌లో పొందవచ్చు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ప్రత్యేక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి మెడికవర్ హాస్పిటల్స్ కట్టుబడి ఉంది" అని తెలిపారు. ప్రొద్దుటూరు మరియు సమీప ప్రాంతాల ప్రజలు ప్రతి నెల మూడవ బుధవారం శ్రీ సాయి దయాగ్నస్టిక్ సెంటర్‌లో నిర్వహించే రుమటాలజీ ఓపీ సేవలను వినియోగించుకొని, కీళ్ల మరియు ఆటో ఇమ్యూన్ వ్యాధులకు నిపుణులైన వైద్యుల సలహాలు పొందాలని ఆసుపత్రి యాజమాన్యం సూచించింది.

## సీజనల్ జ్వరాలపై అవగాహన సమావేశం



సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం

**పీలేరు, జూలై 15 ప్రభాతవార్త:**

మండలంలోని ప్రజలు ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలే సీజనల్ జ్వరాల నివారణ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటింటా నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలపై పీలేరు మండల సబ్ యూనిట్ అధికారి టి. విద్యాసాగర్ అధికారి ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నిల్వ నీరు లేకుండా చూడడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, తాగు నీటిని మరిగించి తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని వివరించారు. అలాగే గ్రామాల్లో ప్రతి కుటుంబానికి ఈ అంశాలపై అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ కుసుమ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు విజయకుమారి, పి. చిన్నరెడ్డప్ప, ఆర్. శివ ప్రసాద్ బాబు, ఆశా కార్యకర్తలుముత్యాలమ్మ, సునీత పాల్గొన్నారు.

## అతిగా మొబైల్ ఫోన్ వాడటం వల్ల పిల్లలకు కంటి చూపు పోయే ప్రమాదం




**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 15 ప్రభాతవార్త**

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కూల్ ఐస్క్రీనింగ్‌లో భాగంగా ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్ నందు స్కూల్ పిల్లలకి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సంరక్షణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం లాంఛనంగా కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అర్చన,ఆప్తాల్మిక్ అధికారి కేజే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. డాక్టర్ అర్చన మాట్లాడుతూ విటమిన్ ఏ లోపంతో ఒకప్పుడు బిటాట్ స్పాట్స్ అనేవి కంటిలో ఏర్పడేవని అయితే ఇప్పుడు మనము రెగ్యులర్గా వ్యాక్సినేషన్ తో పాటు విటమిన్ ఏ ద్రావణం కూడా చిన్నపిల్లల్లో ఇస్తున్న వలన, అలాగే మంచి ఆహారం తీసుకోవడం వలన చాలవరకు తగ్గాయని,అందువలన పిల్లలు ప్రతినిత్యం మంచి పోషక విలువలు కూడిన ఆహారంతో పాటు వ్యాయామము చేయడం అలవాటు పరుచుకోవాలన్నారు. మొబైల్ ఫోన్ పిల్లలు ఎక్కువ సేపు చూడడం వలన కంటిచూపు కోల్పోవడమే కాకుండా మెదడులోని నరాలు ఒత్తిడికి గురై మానసిక సమస్యలు వచ్చే అవకాశం కూడా ఎక్కువగా ఉంది కావున సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్లో వాడకం తగ్గించుకోవాలని పిల్లలకు సూచించారు.తదుపరి రఘురామిరెడ్డి స్కూల్ పిల్లలు అందరిని పరీక్షించి 11 మందికి కంటి అద్దాలు కోరారని,వారందరికీ ప్రభుత్వం ద్వారా ఉచితంగా కంటి అద్దాలు వస్తాయనితెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ వేలంగిని సైన్స్ టీచర్, ఆరోగ్య కార్యకర్త శోభారాణి, ఆశా కార్యకర్త రాణి పాల్గొన్నారు.

## అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఈఎస్‌డీపీ శిక్షణా తరగతులు ప్రారంభం

**రాజంపేట, జూలై 15 ప్రభాతవార్త**

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ పథకం కింద విజయవాడ ఇండో యూరో సింక్రొనైజేషన్ సహకారంతో బుధవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కమ్‌స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం జులై 15 నుండి ఆగస్టు 8 వరకు నిర్వహిస్తారు.ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగాలకు చెందిన నాలుగో సంవత్సరం బి.టెక్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ శిక్షణలో అందించే ప్రతి అంశాన్ని శ్రద్ధగా నేర్చుకొని తమ భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఏఐటీఎస్ ప్రిన్సిపాల్ డా. ఎస్. ఎం. వి. నారాయణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగాధిపతి డా. పి. ఫణీంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు డేటా సైన్స్‌తో పాటు వ్యవస్థాపక నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకొని పరిశ్రమలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకుంటారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగాధిపతి డా. ఎన్. పెంచలయ్య మాట్లాడుతూ, ఈ తరహా పరిశ్రమ ఆధారిత శిక్షణా కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందిస్తాయనన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పులివెందుల, జూలై 15, ప్రభాతవార్త :**

పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాల్లో నేడు (గురువారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కోతి సమాధి మరియు గవర్నమెంట్ హాస్పిటల్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల తొలగింపు పనులు చేపట్టను న్నందున రాజీవ్ నగర్, ఉలిమల్ల రోడ్డు, కడప రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.అలాగే వాసవీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు పనులు నిర్వహించనున్న నేపథ్యంలో ఆ కాలనీ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.ఈ నిర్వహణ పనుల కారణంగా తాత్కాలికంగా ఏర్పడే అసౌకర్యాన్ని వినియోగదారులు అర్థం చేసుకుని సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రొద్దుటూరు అర్బన్, జూలై 15 ప్రభాతవార్త**

రోటరీ సర్వీస్ కాంప్లెక్స్ ట్రస్ట్ ప్రొద్దుటూరు,జిల్లా అంధత్వ నివారణ సొసైటీ కడప వారి సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దొరసాని పల్లె ఎస్బిఐ కాలనీ నందు ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ప్రొద్దుటూరు రోటరీ కంటే ఆస్పత్రి ప్రముఖ నేత్ర వైద్యులు ఈ శిబిరం నందు కంటి పరీక్షలు నిర్వహించారు.ఆపరేషన్లకు అర్హులైన వారిని ఉచితంగా కెట్రాక్ట్ ఆపరేషన్లు చేయిస్తామని, ఆపరేషన్లు చేయించుకున్న వారికి కంటి నందు అమర్చు లెన్సు భోజనము వసతి మరియు కంటి అద్దములు ఉచితంగా కల్పించబడునన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కొవ్వూరు రమేష్ రెడ్డి, రోటరీ ట్రస్ట్ ప్రెసిడెంట్ ఎంవియన్ ప్రభు, రోటరీ ట్రస్ట్ కార్యదర్శి బేపారి జాకీర్ అహ్మద్,రొటేరియన్లు మల్లికార్జున రావు,బాల సూర్యారావు,గుర్రం రామ కృష్ణ కేటి రవిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుబ్బరామయ్య పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాలలో పారిశుద్ధంపై దృష్టి



**తంబళ్లపల్లె జూలై 15 ప్రభాతవార్త :**

సచివాలయాల పరిధిలోని మారుమూల గ్రామాలలో పారిశుద్ధంపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఉషారాణి కార్యదర్శి తోపాటు బ్రెయిన్ అంబాసిడర్లకు సూచించారు. బుధవారం ఆమె మండలంలోని మర్రిమాకులపల్లి, కన్నెమడుగు పంచాయతీల్లో డిప్యూటీ ఎంపీడీవో ఎంవి ప్రసాద్‌లతో కలిసి పలు గ్రామాలను పర్యటించారు. గ్రామాలలో పారిశుధ్యం పై గ్రీన్ అంబాసిడర్ల పనితీరుపై ఆరా తీశారు. గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల కల్పనపై చొరవ చూపాలని కార్యదర్శులకు సూచించారు. అక్కడే స్వచ్ఛ రథం నిర్వహణపై ఆరా తీసి పనికిరాని ప్లాస్టిక్ ఇతర వస్తువులు సేకరణ అందుకు తగ్గట్టు సరుకులు పొందడం పై హర్షం వ్యక్తం చేశారు.

## బాలికే భవిష్యత్తుఖితో విద్యార్థుల్లో చైతన్యం



**మైదుకూరు, జూలై 15, ప్రభాతవార్త:**

బాలికల రక్షణ, విద్యాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ భేటీ బచావో-భేటీ పడావోఖి కార్యక్రమంలో భాగంగా మైదుకూరు మండలంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్వైజర్ జె. ప్రశాంతి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, బాలల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్‌లైన్-1098, మహిళల భద్రత కోసం వుమెన్ హెల్ప్‌లైన్-181, మానసిక ఆరోగ్య సహాయం కోసం టెలి మానస్ హెల్ప్‌లైన్-14416 సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ జె. శ్రీదేవి మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాలు, వాటి ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు.విద్యార్థులు తమ హక్కులను తెలుసుకొని, విద్యకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని వక్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తూ విజయవంతంగా ముగిసింది.

## బద్వేల్‌లో పర్యావరణ యోధుడు

**బద్వేలు అర్బన్, జూలై 15, ప్రభాతవార్త**



ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా సైకిల్ యాత్ర చేపట్టి దేశవ్యాప్తంగా మొక్కలు నాటుతూ అవగాహన కల్పిస్తున్న పర్యావరణ యోధుడు కే. ముత్తుసెల్వన్ బుధవారం కడప జిల్లా బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై రంగారావును కలిసి తన పర్యావరణ యాత్ర వివరాలను తెలియజేశారు. ముత్తుసెల్వన్ మాట్లాడుతూ, 2021 డిసెంబర్ 21న తమిళనాడు నుంచి ప్రారంభమైన తన సైకిల్ యాత్ర ఇప్పటివరకు 38,600 కిలోమీటర్లు పూర్తి చేసిందని తెలిపారు. ఈ ప్రయాణంలో భాగంగా 8,02,060 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. భారతదేశంతో పాటు నేపాల్, బంగ్లాదేశ్ దేశాల్లో తన యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన ముత్తుసెల్వన్, తదుపరి మయన్మార్ (బర్మా), థాయ్‌లాండ్, వియత్నాం దేశాల్లో కూడా పర్యావరణ సందేశాన్ని విస్తరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. "ఒక్క మొక్క... ఒక్క ప్రాణం. ప్రకృతిని కాపాడటం మనందరి బాధ్యత" అనే సందేశంతో ముందుకు సాగుతున్న ముత్తుసెల్వన్ సేవలను రూరల్ ఎస్సై రంగారావు అభినందించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

## ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి




**దువ్వూరు, జూలై 15, ప్రభాతవార్త:**

ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఎల్ నీనో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, అందువల్ల తక్కువ నీటితో పండే మినుము, పెసర, జొన్న వంటి పంటలు సాగు చేసుకోవాలన్నారు. బోర్ల కింద వరి, మొక్కజొన్న పంటలు వేయరాదని ఇతర పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. ఏపీఎం యాప్ ద్వారా యూరియా, డిఏపి పంపిణీ చేస్తున్నామని దీనిపైన రైతులకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని రైతులకు ఈ నెల 31 తేదీలోగా పంటల భీమా చేసుకోవాలని తెలిపారు. రైతులకు ఎల్ నీనో ప్రభావంతో వర్షం తక్కువగా ఉంటుందని, పాకాల వర్షాలు, వరదలు వంటి అవకాశాలు కూడా ఉంటాయి అని ముందస్తు ప్రణాళికలతో వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారి మమత పాల్గొన్నారు.

## ఆదినారాయణ రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి

**పులివెందుల, జూలై 15 ప్రభాతవార్త :**

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్సీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక క్యాంప్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్, రాష్ట్ర నూర్ భాషా సంఘం నాయకుడు రసూల్, వైఎస్సార్సీపీ భూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి దాసరి చంద్రమౌళి, లింగాల నాయకుడు నాగేంద్ర రెడ్డి లు మాట్లాడుతూ జమ్మలమడుగు స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన అనుమతులు వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలోనే మంజూరయ్యాయని, అప్పట్లో స్టీల్ ప్లాంట్ జీఎం జిందాల్ సామాజిక మాధ్యమాల ద్వారా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీతో పాటు జిల్లాలోని అనేక పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలోనే జరిగాయన్నారు. ఆదినారాయణ రెడ్డి గతంలో వైఎస్సార్సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి అనంతరం టీడీపీలో చేరి మంత్రి పదవి చేపట్టారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా కొనసాగుతూ జమ్మలమడుగు నియోజకవర్గానికి, జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి జిల్లాలో అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ఆయనపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. ఆర్టీపీపీ నుంచి ఫ్లై యాష్ తరలింపు, జువారి సిమెంట్, ఐసీఎల్ వంటి అంశాల్లో గతంలో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ ఆదినారాయణ రెడ్డి వ్యాఖ్యలను తప్పుబట్టారు. డ్రగ్స్ కేసు, గండికోట నిర్వాసితుల పరిహారం, ఉద్యోగ హామీలు, దేవగుడిలో వైఎస్సార్ విగ్రహం తొలగింపు వంటి అంశాలను కూడా ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలపై వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తారని వైఎస్సార్సీపీ నాయకులు స్పష్టం చేశారు.



## నూతన అంగన్‌వాడీ కార్యకర్తగా నిర్మల జ్యోతి

**ముద్దనూరు జూలై 15, ప్రభాతవార్త:**



పట్టణంలోని ఎస్సీ కాలనీలో గత ఏడాది నుంచి ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో బుధవారం నిర్మల జ్యోతి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే సంక్షేమ సేవలను సమర్థవంతంగా చేరవేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్రాన్ని ఆదర్శవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని ఆమె పేర్కొన్నారు.

## అన్ని గ్రామాలలో డ్రైనేజీ మెరుగు పరచాలి..

**సుండుపల్లి, జూలై 15,ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రతినెల రెండో బుధవారం నిర్వహించే టీడీపీ క్యాడర్ సమన్వయ కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు చప్పిడి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సమావేశంలో మండలానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తీర్మానాలు చేశారు.రైతుల భూ సమస్యలను ఎమ్మార్వో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా ప్రభుత్వం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. అలాగే సుండుపల్లి-రాజంపేట రహదారిని 11 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా, సుండుపల్లి-చీనేపల్లి రహదారిని 9 కిలోమీటర్ల మేర విస్తరించే పనులను చేపట్టాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.మండల కేంద్రంలో, గ్రామ పంచాయతీల్లో సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే సమగ్ర డ్రైనేజ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని కోరుతూ తీర్మానం చేశారు. సమావేశంలో ఆమోదించిన అన్ని తీర్మానాలను మై టీడీపీ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## కలసపాడు రెవిన్యూలో భూ దందా

**కలసపాడు, జూలై 15 ప్రభాతవార్త:**

మండలంలో పార్టీ నాయకులు చేస్తున్న భూ దందా ఇది. అధికారుల సహాయ సహకారాలు ఉండడమే దీనకి కారణం అని తెల్లపాడు గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కడప రమణారెడ్డి మండిపడ్డాడు. 2007వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి పేదలకు భూపంపిణీలో భాగంగా, మండలంలోని, కలసపాడు 1బి,అయ్యవారి పల్లె,తదితర రెవెన్యూ విలేజ్‌లలో పేద ప్రజలందరికీ డికేటి పట్టాలు, పాసుబుక్కులు పంపిణీ చేశారు. ఇప్పటికైనా పై అధికారులు పర్యవేక్షణ చేసి పేదలకు అందాల్సిన భూములను పేదలకు ఇవ్వాలని మాజీ సర్పంచ్ కడప రమణారెడ్డి హెచ్చరిక చేశారు.

## ఒప్పంద అధ్యాపకుల సర్వీసు రెన్యువల్ కోసం దరఖాస్తులు ఆహ్వానం

**పీలేరు జూలై 15 ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలలో 2025,26 విద్యా సంవత్సరంలో పనిచేసిన ఒప్పంద అధ్యాపకులు 2026,27 విద్యా సంవత్సరానికి గాను తమ సర్వీసును రెన్యువల్ చేసుకోవాల్సిందిగా అన్నమయ్య జిల్లా ఐడి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వినీల ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్ళ ద్వారా 17.07.2026 తేదీలోగా ఐడీ కళాశాల అయిన సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరుకు సమర్పించాలని తెలియజేశారు.

# సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా పనిచేయాలి

### రాష్ట్ర ఎస్‌టి కమీషన్ సభ్యులు వెంకటప్ప




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టి కమీషన్ సభ్యులు

**మదనపల్లె, జులై 15 ప్రభాతవార్త :**

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం గిరిజనులందరికి వందశాతం చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర ఎస్‌టి కమీషన్ సభ్యులు వెంకటప్ప తెలిపారు. బుధవారం అన్నమయ్య జిల్లా పుంగనూరు, రామసముద్రం మండలాల్లోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. గిరిజనులతో ప్రత్యేక్షంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజనుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గిరిజనులు గతంలో ఆధార్‌కార్డులు, గృహవసతి, ఇతర ప్రభుత్వ సేవలు పొందడంలో ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రభుత్వం దశల వారీగా పరిష్కరిస్తుందన్నారు. రామసముద్రం మండలం గోసువారిపల్లె గ్రామంలోని కొన్ని గిరిజన కుటుంబాలకు ఇండ్లు, ఆధార్‌కార్డులు లేవన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి ఇళ్ళులేని కుటుంబాలు, ఆధార్‌కార్డులు లేని లబ్దిదారులను గుర్తించి తక్షణ పరిష్కారం చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. అసైనెడ్ భూముల ఆక్రమణలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్మశాన వాటికలు, తాగునీరు, విద్యుత్, రహదారులు, గృహవసతి వంటి మౌళిక సదుపాయాలను కల్పించాలని అధికారులకు సూచించామన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి ట్రైబుల్ నేషనల్ ప్రెసిడెంట్ అక్కులప్పనాయక్, గిరిజన సంఘాల నాయకులు సాకే వీరాంజనేయులు, శ్రీనివాస్ వర్మ, కుప్పం జగన్, విజయకుమార్ పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల పరిశీలన

**కడప కార్పొరేషన్ జూలై 15 ప్రభాతవార్త:**

నగరంలోనీ గృహాల నుంచి చెత్తను సేకరిస్తున్నామని, అలాగే వీధుల్లో రోడ్ల పైన ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డ్ తరలిస్తున్నామని కడప కార్పొరేషన్ కమిషనర్ డా.పి. భవాని ప్రసాద్, ప్రజా వైద్య అధికారి సౌధాగిరి డా. రమేష్ లు తెలిపారు. బుధవారం కడప నగరంలో ఆర్కేనగర్ లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెత్త సేకరణ విషయాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా చేస్తామని చెప్పారు.



# అయ్యవారిపల్లెలో పొలం పిలుస్తోంది



**చాపాడు. జూలై 15.ప్రభాతవార్త :**

మండలంలోని అయ్యవారిపల్లె, అనంతపురం గ్రామాల యందు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం అయినది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల వ్యవసాయ అధికారిని, దేవి పద్మలత హాజరై రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎల్నినోదృష్టిలోఉంచుకొని ఆరు తడి పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మండలంలో వరిసాగుకు పరిస్థితులు అనుకూలం లేనందున మినుము, జొన్నపంట వేయుటకు ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తుకు వృత్తి నైపుణ్యాలే బలమైన పునాది :మడితాటి నరసింహారెడ్డి




**రాయచోటి జులై 15 ప్రభాతవార్త**

యువత భవిష్యత్తుకు వృత్తి నైపుణ్యాలే బలమైన పునాదని డైట్ ఇన్చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి అన్నారు.ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవంను బుధవారం డైట్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ విద్యా బోధకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ:నైపుణ్యావంతమైన యువతే దేశ సంపదన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలను అలవర్చుకున్న యువత మాత్రమే ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను సమర్థవంతంగా వినియోగించుకోగలరని అన్నారు.వృత్తి విద్య (ఒకేషనల్ ఎడ్యుకేషన్ ) విద్యార్థులను ఉద్యోగాలకు మాత్రమే కాకుండా స్వయం ఉపాధి వైపు కూడా నడిపిస్తుందని తెలిపారు. జాతీయ విద్యా విధానం-2020 (NEP2020)లో వృత్తి విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించబడిందని, ప్రతి విద్యార్థి కనీసం ఒక వృత్తి నైపుణ్యాన్ని నేర్చుకోవడం కాలానుగుణ అవసరమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు మార్ల ఓబుల్ రెడ్డి, డైట్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, ఒకేషనల్ కోఆర్డినేటర్లు షంషీర్ భాష, రామకృష్ణారెడ్డి, వృత్తి విద్యా బోధకులు ఎస్.కె. మహబూబ్ బాషా, పి. రామాంజనేయులు, ఉపాధ్యాయులు ఎం. రత్నాలు, పరశురాం, మల్లికార్జున, సదాశివుడు, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

# దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంత్రి లోకేష్ ఆకస్మిక తనిఖీ







**ప్రొద్దుటూరు జూలై 15 ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను మంత్రి లోకేష్ బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇరాన్అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థులను ఉద్దేశించి ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీ పై ఆధారపడి ఉందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలుచేస్తోందని వివరించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రులు ఫీడ్ బ్యాక్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రి లోకేష్‌కు వివరించారు. పాఠశాల తనిఖీ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మంత్రి ఆరా తీశారు. లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో పాఠశాల 1.3 స్టార్ రేటింగ్ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మిని మంత్రి ప్రశ్నించారు. ఫార్మాటివ్, సమ్మెటివ్ అసెస్ మెంట్ పై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన పాఠశాలల పట్ల ఎంఈవోలు దృష్టిపెట్టాలని, 15 రోజులకోసారి సమీక్ష చేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. హాజరుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరయ్యే పరిస్థితిని నివారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్ రోల్ మెంట్ గతేడాది కంటే తక్కువగా ఉండటంపై మంత్రి ఆరా తీశారు. 10 మంది విద్యార్థులు వసతిగృహాలకు, కేజీబీవీలకు తరలివెళ్లడం వల్ల ఎన్ రోల్ మెంట్ తగ్గిందని ప్రిన్సిపాల్ వివరించారు. గతేడాది కంటే అడకమిక్ ఫెర్ఫార్మెన్స్ మెరుగుపడటం పట్ల మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యమని, అందరం కలిసికట్టుగా ఉంటేనే ఇది సాధ్యమని చెప్పారు. విద్యార్థుల డ్రాప్ అవుట్స్ పై దృష్టిపెట్టాలని.. ముఖ్యంగా విద్యార్థినులు డ్రాప్ అవుట్స్ కాకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో వచ్చే ఏడాదికి 4 స్టార్ రేటింగ్ సాధిస్తామని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి మంత్రి ఫోటోలు దిగారు.

# ఉమ్మడి భవిష్యత్తుకు నైపుణ్యాలే పునాది



**మైదుకూరు, జూలై 15, ప్రభాతవార్త:**

ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం-2026 సందర్భంగా "ఉమ్మడి భవిష్యత్తు కోసం నైపుణ్యాలు అనే అంశంతో జెడ్పీహెచ్ఎస్ఎస్, మైదుకూరులో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంపొందించి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారిని సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలోని BFSI, IT ITeS, ఎలక్ట్రానిక్స్ వృత్తి విద్య ట్రైనర్లు తేజ, జెర్రీ గురుమోహన్, మధు రిమ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రామమోహన్ అధ్యక్షత వహించగా, సీనియర్ ఉపాధ్యాయులు ఎ. రాముడు, కె. పద్మజ, ఆవుల శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయ బృందం పూర్తి సహకారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం డ్రాయింగ్, క్విజ్, రోల్‌ప్లే తదితర పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించగా, విజేతలకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడప జీసీడీఓ దార్ల రూత్ ఆరోగ్య మేరీ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి ప్రతిభను ప్రశంసించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసి మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో వృత్తి విద్య, సాంకేతిక నైపుణ్యాలు యువతకు ఎంతో అవసరమని, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలంటే నైపుణ్యాల అభివృద్ధిపై ప్రతి విద్యార్థి దృష్టి సారించాలని సూచించారు.విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనికతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన

**బద్వేలు అర్బన్, జూలై 15, ప్రభాతవార్త**

ప్రపంచ జనాభా దినోత్సవం వారాంతపు కార్యక్రమంలో భాగంగా బుధవారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా. వై.శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెల్ఫ్ గ్రూపు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. "పిల్లల మధ్య 2 నుంచి 3 సంవత్సరాల ఎడమ ఉండడం మంచిది. చిన్న కుటుంబమే ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబం" అని చెప్పారు. కుటుంబ నియంత్రణ కోసం కండోమ్, ఛాయా, మాలాఎన్, అంతరా, ఈపిల్, పిపిఐయుసిడి/కాపర్‌టి వంటి తాత్కాలిక పద్ధతులు ఉపయోగించాలని సూచించారు. జనాభా నియంత్రణ మహిళల ఆరోగ్యానికి, కుటుంబ ఆర్థిక స్థితికి ఎంతో అవసరమన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.వెంగయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, లింగ వివక్ష లేకుండా ఆడ, మగ సమానమని తెలిపారు. 1994 చట్టం, వ్యాధి నిరోధక టీకాలు, సంక్రమణ అసంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, 108, 102 తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ పథకాల గురించి వివరించారు. 1415 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్, గర్భాశయ, రొమ్ము, నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.జనార్ధనరావు, ఏఎన్ఎంలు బి.సుధ, డి.రావతి, ఆర్.లక్ష్మీదేవి, జి.గురమ్మ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచితంగా వందశాతం వేరుశెనగ విత్తనాల పంపిణీకి శ్రీకారం

**పులివెందుల, జూలై 15 ప్రభాతవార్త :**

ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వేరుశెనగ సాగును ప్రోత్సహిం చేందుకు జిల్లా వ్యవసాయ శాఖ 100 శాతం ఉచితంగా వేరుశెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేయనున్నట్లు ప్లాంటేషన్ మేనేజర్ ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన రైతులకు మినీ కిట్ల రూపంలో విత్తనాలు అందజే యనునున్నట్లు ఈ పథకానికి అర్హులైన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతు భరోసా కేంద్రాలు, మండల వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు అని దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలు, ఐటీ రిటర్న్ లేని ధృవీకరణ, రైతు ఫోటో తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అదేవిధంగా రైతు కుటుంబంలో గత ఐదేళ్లలో ప్రభుత్వ ఉద్యోగులు లేదా ఆదాయపు పన్ను చెల్లింపుదారులు ఉండరాదని అధికారులు స్పష్టం చేశారు. ఎంపికైన రైతులు అవసరమైన పత్రాలతో సంబంధిత రైతు భరోసా కేంద్రంలో విత్తనాలను పొందవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

# ఆముదం మినీ కిట్స్ ఉచిత పంపిణీ



ఆముదం విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పులివెందుల జూలై 15 , ప్రభాత వార్త :**

రాష్ట్ర ప్రభుత్వం నూనె గింజల ఉత్పత్తిని పెంచే లక్ష్యంతో రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న నేపథ్యంలో పులివెందుల మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆముదం మినీ కిట్స్ (చిరు సంచులు) ఉచితంగా పంపిణీ చేశారు.పొలం పిలుస్తోందిభి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి (ఏవో) చెన్నారెడ్డి జాతీయ నూనె గింజల విత్తనోత్పత్తి పథకం కింద సుమారు 6 క్వింటాళ్ల ఆముదం మినీ కిట్స్‌ను రైతులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు నూనె గింజల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆముదం సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఉచిత విత్తన సంచులు పంపిణీ చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆముదం సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న పంట నమోదు కార్యక్రమంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రం (ఆర్‌బీకే) సిబ్బందిని సంప్రదించి తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు చేసిన రైతులకే పెట్టుబడి రాయితీలు, పంట బీమా, యూరియా, డీఏపీ వంటి ఎరువుల సరఫరా తదితర ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పత్తి పంటను పరిశీలించిన అధికారులు, రసం పీల్చే పురుగుల నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఏపీ సీఎంఎఫ్ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు విషరహిత ఆహార ఉత్పత్తుల సాగుపై దృష్టి సారించాలని, రసాయనిక క్రిమిసంహారక మందులు, ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని పిలుపునిచ్చారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం

**పీలేరు ,జూలై 15 ప్రభాతవార్త ;**

నియోజకవర్గంలోని కలికిరి మండలం స్థానిక ఇందిరమ్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా బుధవారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని జరిగింది. ఈ కార్యక్రమానికి అతుల్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత లో భాగంగా వివిధ రకాలైన సుమారు 150 మొక్కలను ఉచితంగా అందజేసింది. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని జానం సుజాత మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. మొక్కలు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన పెంపొందించుకొని ప్రతి సంవత్సరం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. పాఠశాలకు వివిధ రకాలైన 150 మొక్కలను ఉచితంగా అందజేసిన అతుల్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ రెడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో పచ్చదనం పెంపొందించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్ల పెంపకాన్ని ఉద్యమంలా కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అతుల్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు దేవా, డోనాల్డ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

## కడపతో దాల్మియా భారత్ అనుబంధం

# మరింత బలపడుతోంది..!

- దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ పునీత్ యధు దాల్మియా

**జమ్మలమడుగు, జులై 15, ప్రభాతవార్త:**

దాల్మియా భారత్ సంస్థకు ఏపీ కేవలం వ్యాపార రాష్ట్రం మాత్రమే కాదని, ఏళ్ల నాటి సంస్థ ప్రయాణంలో కీలక భాగస్వామి అని దాల్మియా భారత్ మేనేజింగ్ డైరెక్టర్ పునీత్ యధు దాల్మియా అన్నారు. బుధవారం జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం చిన్నకొమెర్లలో నిర్వహించిన దాల్మియా భారత్ 2వ యూనిట్ విస్తరణ పనుల శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పరిశ్రమల ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వేగవంతమైన విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేష్ నాయకత్వం, పరిశ్రమలకు అందిస్తున్న ప్రోత్సాహం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు. పరిశ్రమల శాఖామంత్రి భరత్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ బాధ్యులు భూపేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కడపలో సుమారు 3100 కోట్ల పెట్టుబడితో కొత్త ఉత్పత్తి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ విస్తరణ పూర్తయిన తరూత ఏపీలో సంస్థ దాదాపు కోటి టన్నుల వరకు సిమెంటు ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకుంటుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పరిశ్రమల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు, స్థానిక ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి విశేష ఊతం లభిస్తుందని పునీత్ యధు దాల్మియా తెలిపారు.






మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మెట్టుపల్లె అనురాధ రామచంద్రారెడ్డి, ప్రభాతవార్త ప్రొద్దుటూరు.

## జూనియర్ లెక్చరర్ నాగరాణికి లెక్చరర్‌గా పదోన్నతి

**పీలేరు జూలై 15 ప్రభాతవార్త:**

జూనియర్ లెక్చరర్ గా విశిష్ట సేవలు అందించిన నాగరాణి NTR ప్రభుత్వ కళాశాల వాల్మీకిపురం నందు రాజనీతి శాస్త్ర ఆధ్యాపకురాలిగా పదోన్నతిపై నియమించారు. ప్రిన్సిపల్‌గా విధులు నిర్వర్తినప్పుడు శిథిలావస్తకు చేరిన కళాశాల తరగతి గదులపై పెంకులను తొలగించి GI sheets సహాయంతో కప్పి విద్యార్థులు విద్యను అభ్యసించటానికి అనుగుణంగా తీర్చిదిద్దారు.

# పాత పెన్షన్ అమలు పట్ల యుటిఎఫ్ హర్షం



కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

**రాజంపేట, జూలై 15 ప్రభాతవార్త**

పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ అమలుకు నిర్ణయం తీసుకుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిల్లా హరిప్రసాద్ పేర్కొన్నారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు నోటిఫికేషన్ విడుదలయి ఆలస్యంగా ఉద్యోగంలో చేరిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు పరుస్తూ జీవో విడుదల చేయడం పట్ల యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిల్లా హరిప్రసాద్, రాజంపేట మండల విద్యాశాఖాధికారి డి.సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి పి.వెంకట సుబ్బయ్య హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాజంపేట మండల విద్యా వనరుల కేంద్రం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. యుటిఎఫ్ గత 20 సంవత్సరాల సుదీర్ఘమైన పోరాటల ఫలితం,పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి వల్ల నేటికి కల సాకారమైందని వారు తెలిపారు. పోరాటాలు వృధా కావనడానికి ఈ ఫలితాలే నిదర్శనం అన్నారు. పదవీ విరమణ అనంతరం వృద్ధాప్య జీవితంలో భరోసా నిచ్చే పెన్షన్ విధానం సాధించుకోవడానికి సుదీర్ఘమైన పోరాటాలు చేయవలసి వచ్చిందని రాష్ట్రంలోని దాదాపు 11వేల మందికి పైగా ఉపాధ్యాయులు పాత పెన్షన్ ఫలితాలను పొందారని వారు తెలిపారు. భవిష్యత్తులో మిగిలిన ఉద్యోగ ఉపాధ్యాయులందరిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావడానికి యుటిఎఫ్ అలుపెరుగని పోరాటం చేస్తుందని,ప్రతి ఉద్యోగి పదవీ విరమణ అనంతరం భరోసా కలిగిన పెన్షన్ తో జీవిత భద్రతను పొందడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని తెలిపారు.ఈ సందర్భంగా 2003 డిఎస్సి ఉపాధ్యాయుల ఫోరం నాయకులు ఎం.మాధవ మూర్తి మాట్లాడుతూ సిపిఎస్ విధానం అమలు పరిచిన నాటినుండి యుటిఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటాలు చేసిన ఫలితంగానే పాత పెన్షన్ అమలుపరుస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని యుటిఎఫ్,పిడిఎఫ్ ఎమ్మెల్సీల కృషి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జి. నాగేంద్ర,ప్రధాన కార్యదర్శి కె.శివయ్య,కోశాధికారి కె.శివ కుమార్, సహాధ్యక్షులు ఎస్.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కామనూరు రోడ్డులో స్వచ్ఛ పథం

**దువ్వూరు, జూలై 15, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరులోని కామనూరు రోడ్డులో బుధవారం స్వచ్ఛ పథం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక మూడు రోడ్ల కూడలి నుండి హరిజనవాడ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్నా చెత్తా, చెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేయించారు. అలాగే రోడ్డులో ఉన్న పైప్ లైన్ లీకేజీ కావడంతో వాటిని మరమ్మతులు చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి బుధవారంఏదో ఒక చోట స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని చేపడతామని అందులో భాగంగా కామనూరు రోడ్డులో పరిశుభ్రత చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పరిశుభ్రంగా ఉండెందుకు గ్రామ ప్రజలు కూడా సహకరించాలని, ప్రతిరోజు వాహనం వస్తుందని తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా ఇవ్వాలని పేర్కొన్నారు. తమ ఇళ్లలో ఏవైనా పనికిరాని వస్తువులు ఉంటే వాటికి డబ్బులు కానీ నిత్యవసర సరుకులు కానీ ఇస్తారని, నియమించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డి హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

